సాక్షి
వికారాబాద్
బుధవారం । 30 । ఆగస్టు । 2023



కరుణించని వరుణుడు

నెల రోజులుగా వర్షాలు కురియక రైతులు ఇబ్బంది పడుతున్నారు. సాగుచేసిన పంటలు నీరు లేక ఎండిపోతున్నాయి. 8లో▸



ఆ వైద్యుడు మాకొద్దు

రోగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని అంగడిరాయిచూర్ ప్రజలు డిమాండ్ చేశారు. 8లో▸



అనుబంధానికి ప్రతీక రాఖీ

అన్నా, చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను ఘనంగా నిర్వహించేందుకు యువత సిద్ధమైంది. 9లో▸

న్యూస్‌రీల్

పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్



మున్నూరుసోమారం గ్రామంలో పంటలను పరిశీలిస్తున్న గోపాల్ తదితరులు

ధారూరు: రైతులు వారివారి పొలాల్లో సాగు చేసిన పంటల వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని మున్నూరుసోమారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏఈఓలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న పంటల వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతూ విధిగా సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా పంట దిగుబడి విక్రయించే సమయంలో ఇబ్బందులు ఉండవని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మంజుల, సంజూ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో నక్కల సంచారం

భయాందోళనలో రైతులు



ఊటుపల్లి పొలంలో సంచరిస్తున్న నక్క

దోమ: అడవుల్లో ఆహారం దొరక్క వన్యప్రాణులు పొలాల్లోకి వస్తున్నాయి. మండలంలోని ఊటుపల్లిలో ఓ రైతు పొలంలో వారం రోజులుగా నక్కలు సంచరిస్తున్నాయి. వాటిని చూసిన రైతులు పొలాల వద్దకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఎప్పుడు ఎక్కడ దాడి చేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు నక్కలు పొలాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నీటి సమస్య రానివ్వం

మంత్రి సబితారెడ్డి



సరూర్‌నగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: రాబోయే 50 ఏళ్ల వరకు హైదరాబాద్ నగరానికి మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి సబితారెడ్డి అన్నారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో రూ.2కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంగళవారం ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తాతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. టెండర్లు పూర్తయినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఎస్‌బీఐ కాలనీలోని పార్కు, భగత్‌సింగ్‌నగర్‌లోని మహిళా భవనం పనులు కొద్దిగా ఆలస్యమయ్యా యని అన్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తామని తెలిపారు. రూ.6 కోట్ల వ్యయంతో విజయపురి కాలనీలో ఎస్‌ఎన్‌డీపీ పనులను ప్రారంభించడం జరిగిందని, ఆ పనులు పూర్తయితే ముంపు సమస్య ఉండదన్నారు. త్వరలోనే పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండల్‌రెడ్డి, మహేందర్ యాదవ్, బాలకిషన్, అరవింద్ శర్మ, మల్లేశ్, రాంనర్సింహగౌడ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రక్షాబంధన్

అనంతగిరి: రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని బ్రహ్మకుమారీస్ నిర్వాహకులు మధు మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డిని కలసి రాఖీ కట్టారు. అనంతరం మిఠాయి తినిపించి జ్ఞాపికను అందజేశారు.



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న మధు

హైపర్ 'టెన్షన్'



ఇటీవల గ్రామాల్లో పర్యటించి కాంబినేషన్ డ్రగ్ వినియోగంపై వివరాలు సేకరిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ, వైద్య సిబ్బంది

జిల్లాలో లక్షకు చేరువలో బీపీ, షుగర్ బాధితులు

- రోజురోజుకు పెరుగుతున్న వ్యాధిగ్రస్తులు
- బీపీ పేషెంట్లు 64,795 మంది
- షుగర్ పేషెంట్లు 30,612 మంది
- అదే స్థాయిలో డయాలసిస్ పేషెంట్లు
- అందుబాటులోకి కాంబినేషన్ డ్రగ్

వికారాబాద్: జిల్లాలో హైపర్ టెన్షన్ (బీపీ) పేషెంట్ల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. అదే స్థాయిలో డయాబెటీస్(షుగర్) వ్యాధిగ్రస్తులు సైతం గణనీయంగా పెరిగిపోతున్నారు. ఈ రెండు వ్యాధుల బారిన పడిన వారు జిల్లా వ్యాప్తంగా లక్షకు చేరువయ్యారు. ఇది అధికారిక లెక్కలు మాత్రమే.. అనధికారికంగా రెండు లక్షల వరకు ఉండే అవకాశం ఉందని ఓ అంచనా. ఒకే వ్యక్తిలో బీపీ, షుగర్ ఉన్న వారు 6వేల మంది వరకు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. వీరికి ప్రభుత్వం రెండు నెలలుగా కాంబినేషన్ డ్రగ్ ఉచితంగా అందజేస్తోంది. అయితే మారుతున్న జీవన విధానం, పని ఒత్తిడి, ఉరుకులు, పరుగుల జీవనం తదితర కారణాలతో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతున్నట్లు వైద్యులు తెలిపారు. జీవన విధానం మార్చుకోవడం ద్వారానే ఈ రోగాల బారిన పడకుండా ఉండవచ్చని వారు సూచిస్తున్నారు.

లక్షకు చేరువులో..

వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించిన సర్వే ప్రకారం జిల్లాలో ప్రస్తుతం 64,795 మంది బీపీ పేషెంట్లు, 30,612 మంది షుగర్ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ఈ రెండు కలిపి చూస్తే 95,407 మంది పేషెంట్లు ఉన్నారు. ఒక్కరిలోనే రెండు వ్యాధులు ఉన్నవారు 6వేల పైచిలుకు ఉన్నారు. వీరికి ప్రభుత్వం ప్రతి నెలా ఉచితంగా మందులు పంపిణీ చేస్తోంది. అయితే వాస్తవంలో ఈ గణాంకాలు రెండింతలు ఉండే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. చాలా మంది ప్రభుత్వ సర్వేలకు దూరంగా ఉంటున్నారు. ప్రైవేటు వైద్యశాలల్లో పరీక్షలు చేయించుకొని మందులు వాడుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం షుగర్, బీపీ పేషెంట్లు జిల్లా జనాభాలో 10శాతం ఉండగా, అనధికారికంగా 20శాతం వరకు ఉంటారని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

ఉచితంగా కాంబినేషన్ డ్రగ్

బీపీ, షుగర్ రెండూ వచ్చిన వారికి కాంబినేషన్ డ్రగ్ అవసరం. అయితే వాటిని కొనుగోలు చేసే స్తోమత లేని పేదలు ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఇప్పటి వరకు ప్రభుత్వం షుగర్, బీపీ పేషెంట్లకు వేర్వేరు మాత్రలను ఉచితంగా పంపిణీ చేసేది. అయితే కొందరు ప్రైవేటుగా కాంబినేషన్ డ్రగ్ కొనుగోలు చేసి వాడేవారు. ఆర్థిక స్తోమత లేనివారు ఏదోలా కాలం వెల్లదీశారు. దీంతో కిడ్నీ సంబంధ వ్యాధి బారిన పడుతున్నారు. ప్రస్తుతం వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ ప్రాంతాల్లో డయాలసిస్ సెంటర్లు ఉన్నాయి. ఈ కేంద్రాల్లోని సిబ్బంది 24 గంటల పాటు పని చేసినా కిడ్నీ సంబంధిత రోగులకు పూర్తిస్థాయి వైద్యం అందే పరిస్థితి లేదు. ప్రభుత్వం ఉచితంగా కాంబినేషన్ డ్రగ్ పంపిణీ చేస్తుండడంతో ఒక్కో రోగికి ప్రతి నెలా రూ. 1,500 ఆర్థిక వెసులుబాటు కలుగుతోంది. అంతేకాకుండా కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గే అవకాశం ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి



బీపీ, షుగర్ రెండూ ఉన్న పేషెంట్లకు ప్రభుత్వం రెండు నెలలుగా కాంబినేషన్ డ్రగ్‌ను ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఈ మందులు వ్యాధిగ్రస్తులకు చేరుతున్నాయా? వాడితే వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది.. అనే విషయాలను ఇటీవలే క్షేత్రస్థాయిలో పరిశీలించాం. చాలా మంది మందులు బాగా పని చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులను వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ పల్వాన్‌కుమార్, డీఎంఅండ్‌హెచ్‌ఓ



సమావేశంలో మాట్లాడుతున్న కర్ణాటక రాష్ట్ర మంత్రి శరణు ప్రకాష్‌పాటిల్

తెలంగాణలో మార్పు ఖాయం

- కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరిగింది
- కర్ణాటకలో ఎన్నికల హామీలను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం
- అభివృద్ధిలో మేమే మెరుగ్గా ఉన్నాం
- కర్ణాటక రాష్ట్ర మంత్రి శరణు ప్రకాష్‌పాటిల్

తాండూరు: తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కర్ణాటక రాష్ట్ర వైద్య విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి శరణు ప్రకాష్‌పాటిల్ అన్నారు. మంగళవారం పట్టణంలో బాలాజీ హాస్పిటల్‌లో నిర్వహించిన వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు హామీలు ఇచ్చామని, వాటిని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. పథకాల అమలుకు ప్రతి ఏటా రూ. 50వేల కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే వైద్య విద్యకు కర్ణాటక రాష్ట్రం కేంద్రంగా మారిందన్నారు. అభివృద్ధిలో తెలంగాణ కంటే మేమే మెరుగ్గా ఉన్నామని అన్నారు. తెలంగాణలో ఈ సారి కాంగ్రెస్ పార్టీకి అనుకూల పవనాలు వీస్తున్నాయని తెలిపారు. చేవెళ్ల సభ సక్సెస్ కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగిందన్నారు. మైల్వార్, నీళ్లపల్లి అటవీ భూముల పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారని విలేకరులు ప్రశ్నించారు. స్పందించిన శరణు ప్రకాష్‌పాటిల్ ఇరు రాష్ట్రాల సరిహద్దులో అటవీ భూ వివాదం నెలకొన్న విషయం వాస్తవమేనని అన్నారు. ఈ విషయమై గతంలో వికారాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు తమను కలిశారన్నారు. అయితే ఈ భూములపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వాల సమన్వయంతో సర్వే చేయించాల్సి ఉందన్నారు. త్వరలో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునిత, మాజీ కౌన్సిలర్ పీ బస్వరాజ్, కాంగ్రెస్ నాయకుడు కోర్వార్ నగేష్, డాక్టర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు స్పెషల్ డ్రైవ్

షాద్‌నగర్: డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు షాద్‌నగర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కమలమ్మ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. డిగ్రీ ప్రవేశాల కోసం దోస్త్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్, అప్లికేషన్స్‌లో 74, బీఎస్సీలో 25, బీజెడ్సీ, బీజెడ్‌సీలో 63, బీఎస్సీ ఎంపీసీ, ఎంపీసీఎస్‌లో 53, బీఏ ఇంగ్లిష్ మీడియంలో 5, బీఏ (హెచ్‌ఈపీ) తెలుగు మీడియంలో 5, బీఏ (హెచ్‌ఈపీ) ఇంగ్లిష్ మీడియంలో 34సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 98667 42205 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో..



తిమ్మానగర్ సమావేశంలో మాట్లాడుతున్న గడ్డం ప్రసాద్‌కుమార్

కేసీఆర్ కుటుంబమే బాగుపడింది

- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ. 2లక్షల రుణమాఫీ
- రూ. 500లకే గ్యాస్ సిలిండర్
- యువతులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు
- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. మండలంలోని తిమ్మానగర్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌కు రెండుసార్లు అధికారం ఇచ్చినా వారికి చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 18 సంవత్సరాలు నిండిన యువతులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. గృహలక్ష్మి పథకం కింద ఇల్లు నిర్మించుకునే వారికి రూ. 5 లక్షలు ఇస్తామని ప్రకటించారు. ఏకకాలంలో రూ. 2లక్షల రైతు రుణమాఫీ అమలు చేయనున్నట్లు వివరించారు. వంట గ్యాస్ సిలిండర్‌ను రూ. 500కే సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాములు, రాంపూర్ తండా, ధర్మాపూర్ సర్పంచులు పాండునాయక్, అనిల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ బాబాఖాన్, బుజ్జయ్యగౌడ్, అమరేశ్వర్‌రావు, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు పీఆర్ ఎస్‌ఈ కార్యాలయం

- వికారాబాద్, నారాయణ్‌పేట్ జిల్లాలకు సేవలు
- మరో రెండు సబ్ డివిజన్ కార్యాలయాలు
- తాండూరులో అదనంగా ఈఈ ఆఫీస్



వికారాబాద్‌లోని పీఆర్ ఈఈ కార్యాలయం

వికారాబాద్: పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖకు సంబంధించి జిల్లాకు మరిన్ని కొత్త పోస్టులు, కార్యాలయాలు మంజూరయ్యాయి. పని ఒత్తిడితో సతమతమవుతున్న ఆ శాఖ అధికారులు కాస్త ఊపిరి పీల్చుకోనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల్లో కొత్తగా ఎస్‌ఈ, ఈఈ, డీఈ పోస్టులు మంజూరు కాగా మన జిల్లాకు కొత్త పోస్టులు, కార్యాలయాలను ప్రభుత్వం మంజూరు చేసింది. వికారాబాద్‌కు సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ కార్యాలయం మంజూరయ్యింది. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు రంగారెడ్డి జిల్లా ఎస్‌ఈ కార్యాలయం ద్వారా ఈ జిల్లాకు సేవలందించే వారు. కొత్తగా ఏర్పాటు కానున్న ఎస్‌ఈ కార్యాలయం ద్వారా వికారాబాద్‌తోపాటు పొరుగు జిల్లా నారాయణ్‌పేట్‌కు కూడా సేవలందించనున్నారు. ఈ కార్యాలయాలను సెప్టెంబర్ 9 నుంచి 12వ తేదీల్లో జిల్లా మంత్రి మహేందర్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

మంజూరైన కొత్త కార్యాలయాలు

జిల్లా కేంద్రంలో ఎస్‌ఈ కార్యాలయం, తాండూరులో ఈఈ, క్వాలిటీ కంట్రోల్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటి వరకు వికారాబాద్‌లో మాత్రమే క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజనల్ కార్యాలయం ఉండేది. ప్రస్తుతం తాండూరులో మరో సబ్ డివిజనల్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు.ఇక మీద వికారాబాద్, ధారూరు మండలాలకు కలిపి ఒక సబ్‌డివిజన్ కార్యాలయం, మోమిన్‌పేట, తాండూరుకు కలిపి మరో సబ్ డివిజనల్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. వికారాబాద్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి తాండూరు ఈఈ బాధ్యతలు కూడా నిర్వహించనున్నారు. అలాగే వికారాబాద్ క్వాలిటీ కంట్రోల్ డీఈ వెంకటేశ్వర్‌రావ్ తాండూరు కార్యాలయానికి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనున్నారు. వికారాబాద్ సబ్‌డివిజన్ నుంచి విడిపోయిన మోమిన్‌పేట, నవాబుపేట సబ్ డివిజన్లకు వికారాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న మాధవరెడ్డి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనున్నారు.

తగ్గనున్న పని భారం

జిల్లాలో అవసరం మేరకు ఇంజనీర్ పోస్టులు లేకపోవడంతో సిబ్బంది పని ఒత్తిడికి గురయ్యేవారు. ప్రస్తుతం నూతన కార్యాలయాలు, పోస్టుల మంజూరు కావడంతో వారికి పని భారం తగ్గనుంది. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో ఒక ఈఈ, ఏడుగురు డీఈలు, 27మంది ఏఈలు ఉండాలి, అయితే ఏఈల కొరత చాలా ఉంది. 27 పోస్టులకు గాను కేవలం ఏడుగురే విధులు నిర్వహిస్తున్నారు. నూతన కార్యాలయాల ఏర్పాటుతో ఆ శాఖ ఇంజనీర్లపై పని భారం తగ్గనుంది.

ఓటు హక్కు మన బాధ్యత



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారామణరెడ్డి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- ఎన్నికల సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్

వికారాబాద్ అర్బన్: ఓటు హక్కు మన బాధ్యత అని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కు పొందాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపాళ్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి కళాశాలలో 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాం పరిశీలన

పట్టణంలో ఈవీఎం, వీవీ ప్యాట్ భద్రపరిచిన గోదాంను మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులతో కలసి పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ వెంట వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

- బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి
- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

షాబాద్: మరోసారి బీఆర్‌ఎస్ పార్టీని ఆశీర్వదిస్తే రాష్ట్రంలో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. షాబాద్ మండల పరిధిలోని కొమరబండ–రేగడిదోస్వాడ గ్రామాలను కలిపే హైవే బ్రిడ్జి నిర్మాణ పనులకు మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే యాదయ్యతో కలసి ఆయన శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జిల్లాలో రోడ్లు, బ్రిడ్జి నిర్మాణాల కోసం ఇప్పటివరకు రూ.124 కోట్ల నిధులు అందించామన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో రూ.52 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఐటీ మినిస్టర్ కేటీఆర్‌తో మాట్లాడి షాబాద్‌లో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు మానుకోవాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మీ, సర్పంచ్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

మాట నిలుపుకోని ప్రభుత్వాలు

- కాంగ్రెస్, బీజేపీ మాదిగలకు చేసిందేమీ లేదు
- విశ్వరూప మహాసభతో సత్తా చాటుతాం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

పరిగి: కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా మాదిగలకు చేసిందేమీ లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, బీజేపీ మాట తప్పాయని మండిపడ్డారు. సెప్టెంబర్ రెండో వారంలో నగరంలో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభ సన్నాహక సదస్సును మంగళవారం పరిగి బృందావన్ గార్డెన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎందుకు వర్గీకరణ చేయలేదో చెప్పాలన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ తొమ్మిదేళ్లు అవుతున్నా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశ్వరూప మహాసభకు మాదిగలు పార్టీలకు అతీతంగా కదలిరావాలని కోరారు. ఈ సభ ద్వారా మన సత్తా చాటి హక్కులు సాధించుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్, జిల్లా నాయకులు మల్లికార్జున్, రమేష్, ప్రకాశ్, రాములు, శివాజీ, అంజి, జానీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

క్లుప్తంగా

రేపటి నుంచి ఆరాధనోత్సవాలు

కొడంగల్: ఈ నెల 31 నుంచి శనివారం వరకు గురు రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు. పట్టణంలోని కేశవనగర్‌లో వెలిసిన రాఘవేంద్ర స్వామి ఆలయంలో 42 ఏళ్లుగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని ఆలయ అర్చకుడు శ్రీనివాస మూర్తి, డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారి కోరారు.

సీఎం కేసీఆర్ పేరిట ప్రత్యేక పూజలు

డీడీఎన్ఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారి

కొడంగల్ రూరల్: దూప దీప నైవేద్య అర్చకుల(డీడీఎన్ఎస్)కు వేతనాలు పెంచుతూ జీఓ విడుదల చేయడంపై సంఘం జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి, అర్చకులు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. జీఓ నెంబర్ 128 ద్వారా ప్రభుత్వం అర్చకుల వేతనాన్ని రూ.6వేల నుంచి రూ.10వేలకు పెంచిందన్నారు. ఈ సందర్భంగా బుధ, గురువారాల్లో ఆలయాల్లో సీఎం కేసీఆర్ పేరిట ప్రత్యేక పూజలు చేయాలన్నారు. వేతన పెంపునకు సహకరించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, సహకరించిన రమణాచారి, వేణుగోపాలాచారి, డీడీఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, దౌల్తాబాద్ వాసు దేవశర్మలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

డిగ్రీ ప్రవేశాలకు 'దోస్త్' స్పెషల్ డ్రైవ్

తాండూరు: డిగ్రీ విద్యను అభ్యసించేందుకు దోస్త్ స్పెషల్ డ్రైవ్ ద్వారా సెప్టెంబర్ 5వరకు గడువు పొడగించినట్లు తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ విద్యలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు డిగ్రీ ప్రవేశాలకోసం మరో అవకాశం కల్పించామన్నారు. ఆన్‌లైన్ ద్వారానే దోస్త్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అందజేయాలన్నారు.

మున్నూరుకాపుల ముందస్తు అరెస్టు



కొడంగల్ పీఎస్‌లో మున్నూరు కాపులు

కొడంగల్: మున్నూరు కాపులు ప్రగతి భవన్ ముట్టడికి పిలుపునివ్వడంతో నియోజకవర్గంలోని ఆ సంఘం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొంకురు శంకరప్ప, సంఘం నాయకులు బి.కిష్టప్ప, కానుకుర్తి నర్సిరెడ్డి, అరిగె ఓం ప్రకాశ్, సిరుసని శ్యాంసుందర్‌లు విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మున్నూరుకాపులను విస్మరించిందన్నారు. నియోజకవర్గ పరిధిలోని మున్నూరు కాపులకు కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి స్థలాలు, నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

కరెంటు బిల్లు కట్టమన్నందుకు..

కన్నతండ్రిని కడతేర్చిన కుమారుడు


రాంచంద్రయ్య (ఫైల్)

అనంతగిరి: కరెంట్ బిల్లు కట్టమన్నందుకు కన్నతండ్రిని కడ తేర్చాడు ఓ కొడుకు. ఈ దుర్ఘటన సోమవారం రాత్రి వికారాబాద్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ టి.శ్రీను తెలిపిన ప్రకా రం.. వికారాబాద్‌మండల పరిధిలోని ఆత్వెల్లి గ్రామానికి చెందిన ఎక్‌మామిడి రాంచంద్రయ్య(58) మేస్త్రీ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. రాత్రి 8.30గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చిన ఆయన విద్యుత్ బిల్లు కట్టమని కుమారుడు యాదయ్యకు చెప్పాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కోపోద్రిక్తుడైన కుమారుడు రాడ్‌తో మెడపై దాడి చేశాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యా యి. వెంటనే ఆయన్ను చికిత్స నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి తమ్ముడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.


వెల్‌చాల్‌లో ఎండిపోతున్న పత్తి పంట


ఎన్కేపల్లిలో ఎండిన మొక్కజొన్న పంట

కరుణించని వరుణుడు

తొలకరి జల్లును నమ్మిన రైతులు సాగు చేసిన పంటలు పాడవుతున్నాయి. అవసరం లేని సమయంలో ఎడతెరిపి లేని వర్షాలు కురిసి.. పంట ఎదుగుదల సమయంలో ముఖం చాటేయడంతో కర్షకులు ఇబ్బందులు పడుతున్నారు.

- ఎండిపోతున్న పంటలు
- కన్నీరు పెడుతున్న రైతులు

మోమిన్‌పేట: నెల రోజులుగా వర్షాలు కురియక రైతులు ఇబ్బంది పడుతున్నారు. సాగుచేసిన పంటలు నీరు లేక ఎండిపోతున్నాయి. వేసవిలో ఉల్లి, కూరగాయ పంటలు సాగు చేసి రైతన్నలను వడగండ్ల వానలు నష్టపరిచాయి. జూన్‌లో మొక్కజొన్న, పత్తి విత్తనాలు విత్తుకున్న తర్వాత వరుణుడు ముఖం చేటేశాడు. దీంతో మొలకలు రాలేదు. జూలై మొదటి వారంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి మొలకలొచ్చాయి. మూడో వారంలో ఎడతెరిపి లేని వర్షాలు కురియడంతో మొలకలు ఎర్రబారి ఎదుగుదల నిలిచిపోయింది. ఆగస్టు మొదటి వారంలో మొక్కల ఎదుగుదల కన్పించినా.. రెండో వారం నుంచి చినుకు జాడ లేదు. దీంతో పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. మొక్క జొన్న కంకులు విడుస్తున్న సమయంలో వర్షాలు లేక ఎండిపోతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి ఇలానే ఉంటే పెట్టుబడులు వచ్చే అవకాశమే లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆగస్టులో అధ్వానం

పంటల సాగుకు జూన్‌లో 116.2 మిల్లీమీటర్ల వర్షపాతానికిగాను 164.2మి.మీ వర్షపాతం నమోదయింది. విత్తనాలు విత్తుకున్న తర్వాత వర్షాలు రాకపోవడంతో మొలకలు రాలేదు. జూలైలో 185.5 మి.మీటర్లకు గాను 413.2 మిమీ వర్షపాతం కురియడంతో మొలకలు పాడయి ఎదుగుదల నిలిచింది. ఆగస్టులో 196.4మిమీ కాగా ఇప్పటికీ 21.8మిమీ వర్షపాతమే నమోదయింది. ఇక్కడ 175మిమీ వర్షపాతం లోటుగా కనిపిస్తోంది. దీంతో పంటల ఎదుగుదల పూర్తిగా నిలిచిపోయింది.

"చినుకు జాడ లేదు



ఆరు ఎకరాల్లో పత్తిసాగు చేశా. జూన్ రెండవ వారంలో విత్తుకొంటే జూలై మొదటి వారంలో మొలకలు వచ్చాయి. ఆపై 15 రోజుల పాటు ఎడతెరిపి లేని వర్షాలు కురిసాయి. ఇప్పుడిప్పుడే ఎదుగుదల ఉంటుందని అనుకుంటుండగా.. చినును జాడ లేదు. దీంతో పంటలు పండు ముఖం పట్టాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇబ్బంది తప్పదు.

– అడివిరెడ్డి, రైతు, ఎన్కేపల్లి

ఎదుగుదల లేదు



ఐదెకరాల్లో పత్తి సాగు చేశా. విత్తనాలు విత్తుకున్న సమయంలో భారీ వర్షాలతో.. ఇప్పుడు వాన జాడ లేక ఇబ్బంది పడుతున్నాం. ఆగస్టు చివర నాటికి పూత, కాయలు వ చ్చేవి. ప్రస్తుతం అడుగు వరకు మొక్క పెరిగింది. పెరుగుదల పూర్తిగా నిలిచిపోయింది.

– నర్సింలు, రైతు, ఎన్కేపల్లి

రైతులకు ఉచిత న్యాయసాయం

చీఫ్ లీగల్ డిఫెన్స్ వెంకటేశ్, డిప్యూటీ లీగల్ డిఫెన్స్ రాము



మాట్లాడుతున్న చీఫ్ లీగల్ డిఫెన్స్ వెంకటేశ్

ధారూరు: రైతులు, ప్రజలకు ఎలాంటి నష్టం జరిగినా కోర్టు నుంచి సాయం అందించేందుకు ముందుంటామని చీఫ్ లీగల్ డిఫెన్స్ టి.వెంకటేశ్, డిప్యూటీ లీగల్ డిఫెన్స్ పి.రాము అన్నారు. మంగళవారం ధారూరు రైతు వేదిక క్లస్టర్ పరిధిలోని రైతులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంవత్సరానికి రూ.3లక్షల లోపు ఆదాయం ఉన్నవారు కోర్టు నుంచి ఫీజు మినహాయింపుతో పాటుగా ఉచిత న్యాయ సలహాలు అందుతాయన్నారు. కోర్టు ప్రతాలకు సంబంధించిన జిరాక్స్‌లకు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. గృహ హింస చట్టం బాధిత మహిళలకు సైతం ఉచిత సాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మౌనిక, మండల వ్యవసాయ విస్తరణ అధికారి సంజూరాథోడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు రుద్రారం వెంకటయ్య, సర్పంచ్ చంద్రమౌలి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎ.అంజయ్య, రైతు బంధు గ్రామ అధ్యక్షుడు పోటరీ చెన్నయ్య, ధారూరు పీఏసీఎస్ డైరెక్టర్ సుధాకర్‌గౌడ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న బాలిక మృతి

యాలాల: పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన బాలిక చికిత్స పొందుతూ.. మంగళవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని అదే పాఠశాలలో చదువుతున్న బాలుడితో చనువుగా ఉండడం బాలిక తల్లి గమనించి మందలించింది. దీంతో ఆ బాలిక ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాలికను చికిత్స నిమిత్తం నగరానికి తరలించారు. మంగళవారం తెల్లవారుజామున పరిస్థితి విషమించడంతో బాలిక మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆత్మహత్య కేసుగా నమోదు చేశామని ఎస్ఐ అరవింద్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

బంట్వారం: రోడ్డు ప్రమాదంలో గాయపడి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని సల్బత్తాపూర్‌కు చెందిన ఎక్కెల్లి శాంతకుమార్(40) ఈ నెల 27న బైక్ పై బంట్వారం వెళ్తున్నాడు. మద్వాపూర్ గేటు సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడటంతో ఆయన తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కుటుంబీకులు తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



పరిగి: ఎమ్మెల్యే ఇంటి ఎదుట ఆశ వర్కర్ల ఆందోళన

ఆశ కార్యకర్తల డిమాండ్

కొడంగల్ రూరల్: ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం చేపట్టిన ఈ ధర్నాలో కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య,ఆశ వర్కర్ల సంఘం తాలూకా అధ్యక్షురాలు జె.స్వాతి, కార్యదర్శి ఎం.సాయమ్మ, పుష్ప, రాణి, శ్రావణి, వెంకటమ్మ, సువర్ణ, అనసూయ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రిస్క్ అలవెన్స్ విడుదల చేయాలి

పరిగి: ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించడంతో ప్రభుత్వం విఫలమైందని ఆశ వర్కర్లు, సీఐటీయూ నాయకులు విమర్శించారు. ఈ మేరకు వారు మంగళవారం పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఇంటిని ముట్టడించారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో ఆయన పీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆశ వర్కర్ల కనీస వేతనం రూ.18వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.11వ పీఆర్సీ ప్రకారం జూన్ నుంచి ఇప్పటి వరకు పీఆర్సీ డబ్బులు చెల్లించాలన్నారు. కరోనా సమయంలో పని చేసిన ఆశ వర్కర్లకు రిస్క్ అలవెన్స్ ప్రకటించి పెండింగ్‌లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంత్రిని కలిసిన కలెక్టర్

వికారాబాద్ అర్బన్: రాష్ట్ర సమాచార పౌర సంబంధాల, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డిని మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డి హైదరాబాద్ లోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్క అందజేసి మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో పాలనాసంబంధమైన పలు అంశాలను చర్చించారు.


మంత్రికి మొక్క అందజేస్తున్న కలెక్టర్

టార్గెట్ రేవంత్..?

- పీసీసీ చీఫ్‌కు చెక్ పెట్టేందుకు గులాబీ బాస్ ఎత్తులు
- అమాత్య పదవి అందుకేనా..?
- 'పట్నం'కు కొడంగల్ గెలుపు బాధ్యతలు

ఎన్నికల వేల ప్రతిపక్షాలకు చెక్ పెట్టేందుకు సీఎం కేసీఆర్ అస్త్రాలు సిద్ధం చేస్తున్నారు. అందుకోసమే నాలుగేళ్లుగా పక్కకు పెట్టిన పట్నం మహేందర్‌రెడ్డికి అమాత్య పదవి అప్పగించారనే ప్రచారం కొనసాగుతోంది. పదవి చేపట్టిన వెంటనే ఆయన సొంత నియోజకవర్గంలో కాకుండా కొడంగల్‌లో పర్యటించడం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది.


సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి(ఫైల్)

తాండూరు: కొడంగల్ అసెంబ్లీ స్థానంలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని ఓడించేందుకు సీఎం కేసీఆర్ పట్నం మహేందర్‌రెడ్డిని బ్రహ్మాస్త్రంగా ప్రయోగించనున్నారా..? అంటే అవుననే సమాధానమే రాజకీయ వర్గాల నుంచి వస్తోంది.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తాండూరు అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి తొలి మంత్రివర్గంలో రవాణా శాఖ మంత్రిగా పనిచేసిన పట్నం మహేందర్‌రెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో బలమైన నేతగా ఎదిగారు. రాష్ట్రంలో రెండవ సారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్‌లో రేవంత్‌రెడ్డిని ఓడించేందుకు పట్నం మహేందర్‌రెడ్డి సోదరుడు పట్నం నరేందర్ రెడ్డిని బరిలో దింపారు. ఈ క్రమంలో తాండూరు అసెంబ్లీపై పట్నం మహేందర్‌రెడ్డి సమయం కేటాయించకపోవడంతో తాండూరులో ఓటమి చెందినా కొడంగల్‌లో రేవంత్‌రెడ్డిని ఓడించడంలో సక్సెస్ అయ్యారు. ఈ సారి కూడా బీఆర్ఎస్ అధిష్టానం అదే ఫార్ములాను అమలు చేయనుంది. రెండవ సారి ప్రభుత్వం ఏర్పడిన నాలుగేళ్ల వరకు పట్నం మహేందర్‌రెడ్డికి అటు నియోజకవర్గంలోనూ.. ఇటు పార్టీలోనూ.. తగిన ప్రాధాన్యత దక్కలేదు. సొంత కేడర్‌పై అక్రమ కేసులు పెట్టినా ఆయన చేయలేక పోయారని వారి సన్నిహిత వర్గమే ఆరోపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించింది. అయితే తాండూరు అసెంబ్లీ స్థానాన్ని సిట్టింగ్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి కేటాయించారు. ఈ క్రమంలో పట్నం పార్టీకి దూరమైతే నష్టం జరుగుతోందని భావించిన అధిష్టానం పట్నం మహేందర్‌రెడ్డికి గనులు, సమాచార మంత్రిగా భాధ్యతలు అప్పగించారు.

కొడంగల్‌లో పాగా వేసేందుకే..

గనులు, సమాచార శాఖ మంత్రిగా భాధ్యతలు చేపట్టిన పట్నం మహేందర్‌రెడ్డి మరుసటి రోజే కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించారు. ఆయన సోదరుడి గెలుపు బాధ్యతను తీసుకున్న మంత్రి ఇక నుంచి కొడంగల్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై దృష్టి సారించనున్నారు. మహేందర్‌రెడ్డి రెండు నెలలు ఇక్కడ పనిచేస్తే గెలుపు ఖాయమనే భావన పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. మంత్రి పదవి చేపట్టిన మహేందర్‌రెడ్డి రోహిత్ ప్రచారానికి వస్తారా లేదా అనే విషయం చర్చనీయాంశమైంది.

పట్నం సోదరులపై ఎదురు దాడి..

పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పట్నం సోదరులపై ఎదురు దాడి ప్రారంభించారు. తాండూరులో పట్నం మహేందర్‌రెడ్డి ఓటమి చెందాకా నాలుగేళ్లుగా సీఎం కేసీఆర్ అపాయింట్‌మెంటే ఇవ్వలేదని విమర్శలు గుప్పించారు. రెండు నెలల కోసం మంత్రి పదవి ఇచ్చి ఎర వేశారని ఎద్దేవా చేశారు. దీనికి తోడు తాండూరు కాంగ్రెస్ నేతలు సైతం పట్నం మహేందర్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారు.

ఎఫ్ఎల్ఎన్ సర్వేకు సహకరించాలి


వికారాబాద్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో సెంట్రల్ టీం సభ్యులు

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల కనీస సామర్థ్యాల సాధనకు చేపట్టిన ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని సెంట్రల్ టీం సభ్యులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రాథమిక పాఠశాల, ఆలంపల్లి, పులుమద్ది ప్రాథమిక పాఠశాలలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బోధనా తీరును వారు పరిశీలించారు. విద్యార్థుల స్థాయిని అంచనా వేశారు. ఈ సందర్శనలో ఎంఈఓ బాబు సింగ్, పాఠశాల హెచ్ఎం వీరేశం, ఉపాధ్యాయులు ఆనంద్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, నస్రీన్ సుల్తానా, పద్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ఎస్పీ కోటిరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: తమ పరిధిలో పనిచేస్తున్న అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ కోటిరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో పనిచేస్తున్న ఏఆర్, ఐటీసీటీ, స్పెషల్ బ్రాంచ్, భరోసా, డీసీఆర్బీ, కంట్రోల్ రూమ్, కమ్యూనికేషన్, కోఆపరేటివ్ సొసైటీ, పే సెక్షన్, బడ్జెట్ సెక్షన్, ఏ సెక్షన్, రికార్డ్స్ సెక్షన్ అధికారులతో కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమన్వయంతో పని చేస్తే ఇబ్బందులు లేకుండా పనులను పూర్తి చేయవచ్చన్నారు.

ఆ వైద్యుడు మాకొద్దు

- పీహెచ్‌సీ ఎదుట అంగడిరాయిచూర్ గ్రామస్తుల ఆందోళన
- సర్దిచెప్పిన డిప్యూటీ డీఎంహెచ్ఓ రవీంద్రయాదవ్


రవీంద్రయాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగడిరాయిచూర్ గ్రామస్తులు

కొడంగల్ రూరల్: ఆస్పత్రికి వచ్చే రోగులపట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని అంగడిరాయిచూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు గ్రామంలోని పీహెచ్‌సీ ఎదుట సర్పంచ్ గోవింద్, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ రవీంద్ర యాదవ్ ఆస్పత్రికి చేరుకుని వారికి సర్ది చెప్పారు. అనంతరం గ్రామస్తులు డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ డిప్యూటీ డీఎంహెచ్ఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్ర యాదవ్ డాక్టర్ హరిప్రసాద్‌తో మాట్లాడి ఇక ముందు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విషయం డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకెళ్తానని.. డాక్టర్ పనితీరు మెరుగు పరుచుకుంటారని గ్రామస్తులకు ఆయన వివరించారు.

రూ.5.90 కోట్లతో గ్రంథాలయ భవనాలు

అందుబాటులో పోటీపరీక్షల మెటీరియల్

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందల్ రాజుగౌడ్



తాండూరు: జిల్లాలో ఇప్పటి వరకు రూ.5.9కోట్ల నిధులతో శాశ్వత గ్రంథాలయ భవనాలు నిర్మించామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందల్‌రాజుగౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తాను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా భాధ్యతలు చేపట్టి నేటికి ఏడాది పూర్తయిందన్నారు. ఏడాది కాలంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాలను మెరుగుపర్చేలా చేపట్టిన చర్యలు విజయవంతమయ్యాయన్నారు. వికారాబాద్‌లో రూ.1.50కోట్లతో భవన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించామని గుర్తు చేశారు. కొడంగల్‌లో రూ.73.90 లక్షలతో, మర్పల్లిలో రూ.43.10లక్షలతో భవన నిర్మాణ పనులను పూర్తి చేసి ఇటీవలే అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. తాండూరు మున్సిపాలిటీలో రూ.1.35కోట్లతో భవన నిర్మాణ పనులకు త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. దోమ, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, మోమిన్‌పేట్ మండల కేంద్రాలలో గ్రంథాలయ భవన నిర్మాణపనులు కొనసాగుతున్నాయన్నారు. జిల్లా గ్రంథాలయంలో సిబ్బంది కొరత తీర్చేందుకు కలెక్టర్ సాయంతో ముగ్గురు రికార్డు అసిస్టెంట్‌లను నియమించామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌లు వచ్చిన నేపథ్యంలో అందుకు అనుగునంగా మెటీరియల్‌ను అందుబాటులో ఉంచామన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తనకు అవకాశం కల్పించిన మంత్రి సబితా ఇంద్రారెడ్డితో పాటు జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు.

మరోసారి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించండి

పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్


మోమిన్‌పేట: ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

మోమిన్‌పేట: బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని టేకులపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు పక్షపాతి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలన్నారు. రైతులకు పెట్టుబడి నుంచి దిగుబడులు కొనుగోలు చేసే వరకు ప్రభుత్వమే అండగా ఉంటుందన్నారు. ఎంపీటీసీ సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటుకు వినతి

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని జాంబపూర్ తండా, కొట్టంగుట్ట తండాలను మున్సిపల్ పరిధి నుంచి తొలగించి పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

భవన నిర్మాణానికి సహకరించాలి

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో టీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల భవన నిర్మాణానికి స్థలంతో పాటు నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు సహకరించాలని వికారాబాద్ నియోజకవర్గ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్ర ం అందజేశారు. నియోజకవర్గ పరిధిలో 600మంది రిటైర్డ్ ఉద్యోగులమున్నామని తమ సాదకబాధకాలు చర్చించుకోవడానికి భవనం నిర్మించుకునేందుకు స్థలం లేదని ఆయనకు వివరించారు.

'గులాబీ' గూటికి నాయకులు

అనంతగిరి: వికారాబాద్ మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన ఆయా పార్టీల నాయకులు మంగళవారం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీకి కార్యకర్తలే కీలకమన్నారు.